సమాచారం

24న ప్రగతిభవన్‌కు లాంగ్‌మార్చ్



నినాదాలు చేస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 24న ఓయూ ఆర్ట్స్ కాలేజీ నుంచి ప్రగతిభవన్‌కు నిరుద్యోగుల లాంగ్‌మార్చ్‌ను నిర్వహించనున్నట్లు విద్యార్థి, నిరుద్యోగ జేఏసీ నాయకులు తెలిపారు. టీఎస్‌పీఎస్సీలో జరిగిన అవకతవకలకు నిరసనగా మంగళవారం ఓయూలో నిరసన తెలిపారు. దోషులను కఠినంగా శిక్షించాలని, సీఎం కేసీఆర్ రాజీనామా చేయాలనే డిమాండ్లతో లాంగ్‌మార్చ్‌ను నిర్వహిస్తున్నట్లు విజయ్, నరేష్, వెంకట్‌యాదవ్, లచ్చిరెడ్డి, శివ, పేర్కొన్నారు.

బీఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షుడిగా జోగు నరేందర్



ఉస్మానియా యూనివర్సిటీ: బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ (బీఎస్ఎఫ్) ఓయూ అధ్యక్షుడిగా జోగు నరేందర్ నియమితులయ్యారు. ఆర్ట్స్ కాలేజీలో ఎంఏ ఫిలాసఫీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నరేందర్ గతంలో నిజాం కాలేజీలో అధ్యక్షులుగా పనిచేశారు. తనపై నమ్మకంతో ఈ పదవికి ఎంపిక చేసిన బీఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు పిడమర్తిరవి, రాష్ట్ర అధ్యక్షులు గాదె వెంకట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అంబేడ్కర్, పూలే ఆలోచన విధానాలు, నిబద్ధతతో విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తానన్నారు.

మదన్‌కుమార్‌కు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: హైకోర్టు లాయర్ కండ్లె మదన్ కుమార్‌కు ఓయూ పీహెచ్ డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. జగిత్యాల జిల్లా, బుగ్గారం మండలం, గోపాలపూర్ గ్రామానికి చెందిన మదన్ కుమార్ ఓయూ క్యాంపస్ న్యాయకళాశాల అధ్యాపకులు ప్రొ.రామారావు పర్యవేక్షణలో ఆర్గనైజ్డ్ క్రైమ్స్ కంట్రోల్ అండ్ రెగ్యులేషన్ త్రు స్పెషల్ లెజిస్లేషన్స్ ఏ కేస్ స్టడీ ఆఫ్ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్ ఇండియా అనే అంశం పై పరిశోధనకు డాక్టరేట్ వచ్చిందని పేర్కొన్నారు.

మంత్రికి ఆహ్వానం



సనత్‌నగర్: ఉగాది అందరి జీవితాల్లో కొత్త ఉషస్సులు నింపాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆకాంక్షించారు. బుధవారం నిర్వహించే జెక్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆవిర్భావం, తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలతో పాటు ఈ నెల 30న కాలనీలో జరిగే శ్రీరామనవమి ఉత్సవాలకు హాజరు కావాలని జెక్‌కాలనీ ప్రతినిధులు మంగళవారం మంత్రిని కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు.

మర్యాదపూర్వక కలయిక

సనత్‌నగర్: హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను మంగళవారం మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి కలువగా ఆయనను దత్తాత్రేయ శాలువాతో సత్కరించారు. తెలంగాణ ప్రాంత అభివృద్ధికి సమష్టిగా కృషి చేసి దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టాలన్నారు. విద్యావేత్తలు, మేధావుల ఆలోచనలు తెలంగాణ అభివృద్ధిలో కీలకంగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు.

తెలుగు సంప్రదాయ గీతిక.. ఉగాది వేడుక

- శోభకృత్ నామ సంవత్సరానికి ఏర్పాట్లు సిద్ధం
- బెల్లం, కొత్త చింతపండుకు భలే గిరాకీ
- కిటకిటలాడిన మార్కెట్లు





సనత్‌నగర్: జీవిత పరమార్థాన్ని చాటే షడ్రుచుల గుబాళింపు ..మనస్సుకు ఆహ్లాదాన్ని పంచే కవి సమ్మేళనం.. శ్రవణానందపు అనుభూతులను వశం చేసే పంచాంగ శ్రవణం వెరసి తెలుగు సంప్రదాయ గీతిక ఉగాది పర్వదిన వేడుకలకు నగరం సిద్ధమైంది. ఉగాది పండుగ ఆస్వాదించేందుకు నియోజకవర్గవాసులు సిద్ధమయ్యారు. వేపపువ్వు, మామిడి, చింతపండు, కొత్తబెల్లం, తదితర పదార్థాలను కొనుగోళ్లతో మార్కెట్లన్నీ కిటకిటలాడుతున్నాయి. అమీర్‌పేట్, ఎస్ఆర్‌నగర్, బేగంపేట్, సనత్‌నగర్, రాంగోపాల్‌పేట్, మోండా మార్కెట్, బన్సీలాల్‌పేట్, పద్మారావునగర్ ప్రాంతాల్లో వాటి అమ్మకాలు మంగళవారం జోరందుకున్నాయి. ఉగాది సందర్భంగా ఆలయాలను ముస్తాబు చేశారు. సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం, బల్కంపేట్ ఎల్లమ్మ ఆలయం, ఎస్ఆర్‌నగర్ వేంకటేశ్వరాలయం, అమీర్‌పేట్ హనుమాన్ దేవస్థానాల్లో ఉగాది ప్రత్యేక పూజలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కాలనీ అసోసియేషన్ల ఆధ్వర్యంలో కాలనీవాసులంతా ఒకచోట చేరి ప్రత్యేకంగా ఉగాది వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

మోడల్‌కాలనీలో...

మోడల్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పండుగ ఏర్పాట్లు చేశారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు స్థానిక కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా నర్తనశాల డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ బాలబాలికలచే భక్తిగీతాల కార్యక్రమం నిర్వహించనున్నారు. 6.30 గంటలకు ఆధ్యాత్మిక జ్యోతిష సుధ మాచిరాజు కిరణ్‌కుమార్‌చే శోభకృత్ నామ సంవత్సర పంచాంగ శ్రవణం జరుగుతుందని ప్రతినిధులు తెలిపారు.

జెక్‌కాలనీలో..

జెక్ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాయంత్రం 6.30 గంటల నుంచి వేడుకలు ప్రారంభం కానున్నాయి. గంట పాటు పంచాంగ శ్రవణం, ఉగాది పచ్చడి పంపిణీతో పాటు చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు జి.సూర్యశంకర్‌రెడ్డి, మల్లు ప్రసాద్ తెలిపారు.

సుందర్‌నగర్ కాలనీలో..

సుందర్‌నగర్ రెసిడెంట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలుగు సంవత్సరాది సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. స్థానిక సుందర భారతిలో జరిగే వేడుకల్లో భాగంగా వేద పండితులచే పంచాంగ శ్రవణ, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉగాది పచ్చడి సేవనం వంటి కార్యక్రమాలు జరుగుతాయని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

ముస్తాబైన దేవాలయాలు..

అడ్డగుట్ట: ఉగాది సందర్భంగా ఆయా ప్రాంతాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్న నేపథ్యంలో నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. తుకారంగేట్‌లోని ఇంద్రలక్ష్మీనగర్ ఉజ్జయిని మహంకాళి దేవాలయం, పహాడి హనుమాన్ దేవాలయం, వెంకట్‌నగర్‌లోని ముత్యాలమ్మ దేవాలయం, సాయినగర్‌లోని వేంకటేశ్వర స్వామి దేవాలయం, శాంతినగర్‌లో దాసాంజనేయ స్వామి దేవాలయాలను సుందరంగా తీర్చిదిద్దారు.

మట్టికుండలకూ డిమాండే..

ఉగాది పర్వదినం సందర్భంగా తయారు చేసే పచ్చడికి మట్టి కుండలనే వినియోగిస్తారు. అయితే ప్రస్తుతం మార్కెట్‌లో మట్టికుండలకు డిమాండ్ పెరిగింది. ప్రతి ఒక్కరూ కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో మట్టి కుండల సైజ్‌లను బట్టి రూ. 400 వరకు విక్రయిస్తున్నారు. ఉగాది పండుగ సందర్భంగా మట్టి కుండలు, మామిడి, వేపాకులు, చింతపండు, బెల్లం కొనుగోళ్లతో మంగళవారం మార్కెట్లన్నీ కిక్కిరిపోయాయి.

పార్టీ బలోపేతమే లక్ష్యం



తెలంగాణ భవన్‌కు బయలుదేరిన నాయకులు, కార్యకర్తలు

కంటోన్మెంట్: కంటోన్మెంట్ నియోజవర్గంలో బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తాని దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తె లాస్య నందిత అన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యకర్తల కార్యవర్గ సమావేశానికి ఆమె ఆధ్వర్యంలో భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా లాస్య నందిత మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పార్టీ అత్యంత బలీయమైన శక్తిగా కొనసాగుతోందని దివంగత ఎమ్మెల్యే సాయన్న ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలయ్యాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్ శ్రీనివాస్, సదానంద్ గౌడ్, సంతోష్, కిరణ్ కుమార్, పెంట శ్రీహరి, నాగినేని సరిత, రేపాల శ్రీనివాస్, నారాయణ, ఖదీరవన్, కసిరెడ్డి, శంకర్ పాల్గొన్నారు.

చర్చనీయాంశంగా మర్రి గైర్హాజరు ..

ఎమ్మెల్యే సాయన్న మరణానంతరం తొలిసారిగా నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలంతా తెలంగాణ భవన్‌కు వెళ్లిన నేపథ్యంలో పార్లమెంట్ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి గైర్హాజరు చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే సాయన్న ఉన్నప్పుడే ప్రతి కార్యక్రమంలోనూ మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొనడంతో పాటు కార్యకర్తలను ముందు వరసలో నిలిచేవారు. సమావేశానికి మర్రి డుమ్మా కొట్టడంతో పార్టీలోని ఆయన వర్గీయులను ఆందోళనకు గురిచేసింది.సమావేశంలో ఈ అంశాన్ని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి లేవనెత్తారు. మర్రి రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలోనే తామంతా పనిచేస్తున్నామని కీలకమైన నియోజకవర్గ స్థాయి సమావేశానికి ఆయనకు ఆహ్వానం లేకపోవడం బాధాకరం అన్నారు. పార్టీ నేతలంతా లాస్య నందిత నేతృత్వంలో తెలంగాణ భవన్‌కు చేరుకోగా, బోర్డు మాజీ సభ్యులు మాత్రం ఎవరికి వారే భవన్‌కు వెళ్లడం గమనార్హం.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి



ఉపాధ్యాయులతో చర్చిస్తున్న లక్ష్మీబాల్‌రెడ్డి

సనత్‌నగర్: ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. అశోక్‌కాలనీలోని ప్రభుత్వ పాఠశాల, ఎస్ఆర్‌టీ కాలనీలోని రౌండ్‌టేబుల్ ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం ఆమె డీఈఈ బుగ్గయ్య, ఏఈ బాబురావులతో కలిసి సందర్శించి పాఠశాలలకు కావాల్సిన వసతులను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను పెంచాల్సిన అవసరం ఉందని చెప్పడంతో అంచనా రూపొందించాలని కార్పొరేటర్ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ..సనత్‌నగర్ నియోజకవర్గంలో మంత్రి చొరవతో వందల కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయన్నారు. నిత్యం ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. కార్పొరేటర్ వెంట బాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్‌రెడ్డి, తన్వీర్‌వహీద్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, జంగారెడ్డి భాస్కర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

అమీర్‌పేట: పాఠశాల నుంచి పిల్లలను తీసుకువచ్చేందుకు వెళ్లిన ఓ మహిళలను ఆటో, డీసీఎం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బోరబండ సైట్-3లో ఉంటున్న అఫ్రోజ్, భార్య అస్మఖాతూన్ (29) ఒంటిపూట బడి కావడంతో మధ్యాహ్నం 12.30 సమయంలో పిల్లలను తెచ్చేందుకు నడుచుకుంటూ వెళ్లింది. కూలీ అడ్డా వద్ద రోడ్డు దాటుతుండగా ఆమెను ఆటో ఢీకొట్టడంతో కింద పడిపోయింది. అదే సమయంలో వేగంగా వచ్చిన డీసీఎం సైతం ఢీకొడుతూ ఆమె చెవిపై నుంచి టైర్ వెళ్లడంతో చెవు తెగి రోడ్డుపై పడిపోయింది. తీవ్ర గాయాలైన ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రమాదానికి కారణమైన ఆటో, డీసీఎంను స్వాధీనం చేసుకున్నారు.

వ్యభిచార గృహంపై దాడి

పోలీసుల అదుపులో ఆరుగురు

అమీర్‌పేట: వ్యభిచార నిర్వహిస్తున్న ఓ గృహంపై టాస్క్‌ఫోర్సు పోలీసులు దాడులు నిర్వహించారు. ఎల్లారెడ్డిగూడ ఇంజినీర్స్ కాలనీలోని ఓ ఇంట్లో వ్యభిచారం నడుపుతున్నారనే సమాచారం మేరకు సోమవారం రాత్రి పోలీసులు దాడులు చేసి నిర్వాహకుడు ఎ.వి.సతీష్‌తో పాటు నలుగురు యువతులు, ఓ విటుడిని అదుపులోకి తీసుకుని ఎస్ఆర్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

రైల్వేస్టేషన్‌లో బ్యాగు చోరీ

సికింద్రాబాద్: రైలు కోసం ఎదురు చేస్తున్న ఓ మహిళ బ్యాగు చోరీకి గురైన ఘటన సికింద్రాబాద్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. చందానగర్ పాపిరెడ్డి కాలనీకి చెందిన అరుణ ఈ నెల 19న బెల్లంపల్లికి వెళ్లేందుకు రైల్వే స్టేషన్‌కు వచ్చి ఎనిమిదో ప్లాట్ ఫాంపై ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు కో సం ఎదురు చేస్తుంది. ఈ క్రమంలో ఆమెకు ఫోన్ రా వడంతో మాట్లాడుతుండగా తన బ్యాగు కనిపించ కుండా పోయింది. తన బ్యాగులో 15 గ్రాముల బంగారు పుస్తెల తాడు, రెండు విలువైన చీరలు ఉన్నట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సేదతీరుతూ మృత్యు ఒడికి..

- చికిత్స కోసం వచ్చి రైల్వే స్టేషన్‌లో వ్యక్తి మృతి

సికింద్రాబాద్: చికిత్స నిమిత్తం నగరానికి వచ్చిన ఓ వ్యక్తి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. నిజామాబాద్ పట్టణానికి చెందిన పిట్ల మల్లేశ్ (36) అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఏడాది క్రితం అనారోగ్యంతో భార్య మృతి చెందింది. రెండో తరగతి చదువుతున్న తన కుమార్తెను తీసుకుని చికిత్స నిమిత్తం ఈ నెల 20న రాత్రి రైలులో సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకున్నాడు. ప్లాట్‌ఫాం నెంబర్-8 ఫుట్ ఓవర్ వంతెన సమీపంలో సేదతీరుతూ నిద్రలోనే మృతి చెందాడు. కుమార్తె ద్వారా వివరాలు తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని మల్లేశ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా.17, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 50, పచ్చిమిర్చి 55, బజ్జీ మిర్చి 35, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 45, పందిరి బీర 45, క్యాబేజీ 13, క్యారెట్ 17, దొండ 35, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 55, గోకరకాయ 45, కీర 15, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 19, కందగడ్డ 35, సొరకాయ 9, పొట్లకాయ 15, ముల్లంగి 3-5.







పీహెచ్‌డీ ఫీజు తగ్గించాలని డీన్‌లకు వినతులు



వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో భారీగా పెంచిన పీహెచ్‌డీ ఫీజులను తగ్గించాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వివిధ ఫ్యాకల్టీ డీన్లకు వినతి పత్రాలను అందజేశారు. మంగళవారం సైన్స్, సోషల్‌సైన్స్, ఇంజినీరింగ్, టెక్నాలజీ, లా, కామర్స్ తదితర విభాగాల డీన్లను కలిసి ఫీజులు తగ్గించాలని లేకుంటే ఆందోళనలు చేపడుతామని వినతుల్లో హెచ్చరించారు.

సీతాఫల్‌మండికి చేరిన మాదిగల సంగ్రామ యాత్ర



సికింద్రాబాద్: ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్ సమావేశాల్లోనే చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ నగరంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన మాదిగల సంగ్రామ యాత్ర మంగళవారం సీతాఫల్‌మండికి చేరింది. పార్లమెంట్‌లో చట్టబద్ధత కోసం ఏప్రిల్ 3న మంద కృష్ణమాదిగ నేతృత్వంలో నిర్వహించనున్న బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు తరలిరావాలని కరపత్రాల పంపిణీ ద్వారా ఇంటింటి ప్రచారం చేశారు. బీదలబస్తీ, మేడిబావి, రామాలయం వీధి తదితర ప్రాంతాల్లో పాదయాత్ర చేసిన నాయకులు వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత లభించని కారణంగా మాదిగ విద్యార్థులు విద్య, ఉద్యోగ రంగాల్లో నష్ట పోతున్నారన్నారు. నర్సింగ్‌మాదిగ, చాగంటి యాదగిరి, విజయ్‌కుమార్, గడ్డం శ్రీను, తరుణ్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం

కంటోన్మెంట్: ఆలయాభివృద్ధికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చిన టీఎస్ఎండీసీ చైర్మన్ మన్నె క్రిశాంక్ మంగళవారం విరాళం అందించారు. మంగళవారం జరిగిన బోయిన్‌పల్లి చిన్నతోకట్టాలోని శ్రీదేవీ నల్లపోచమ్మ ఆలయ వార్షికోత్సవం ఆయన పాల్గొని ఆలయ అభివృద్ధికి రూ.25వేల విరాళం అందజేశారు.

- శోభకృత్ నామ సంవత్సరం ఆఖరి అమావాస్యను పురస్కరించుకుని చిన్నతోకట్ట మైసమ్మ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలకు బీఆర్ఎస్ సీనియర్ నేత ఎన్. శ్రీగణేశ్ హాజరై ప్రత్యేక పూజల నిర్వహించారు.



విరాళం అందజేస్తున్న కృశాంక్



పూజల్లో పాల్గొన్న శ్రీగణేశ్

రంజాన్ వేడుకలకు భారీ ఏర్పాట్లు



పద్మారావుగౌడ్‌తో సమావేశమైన మైనారిటీ సభ్యులు

సికింద్రాబాద్: రంజాన్ వేడుకలను పురస్కరించుకుని అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామని శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ చెప్పారు. రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం అవుతున్న క్రమంలో మంగళవారం రాత్రి సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ మజీద్ కమిటీలు, మైనారిటీ సంస్థల ప్రతినిధులు పద్మారావుగౌడ్‌తో సమావేశమయ్యారు. చిలకలగూడ, శేషాపహాడ్ ఈద్గాలు, చిలకలగూడ, లాలాగూడ, బౌద్ధనగర్, మాణికేశ్వరీ నగర్ ప్రాంతాల్లోని మసీదుల వద్ద అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని జీహెచ్ఎంసీ, జలమండలి అధికారులను ఆదేశించారు.

కోర్టు తీర్పుపట్ల హర్షం

ఉస్మానియా యూనివర్సిటీ: జూనియర్ లెక్చరర్ (జేఎల్) ఉద్యోగాల రాత పరీక్షను తెలుగుభాషలోనూ రాయవచ్చని హైకోర్టు తీర్పు పట్ల నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఇందుకు కోసం పోరాడిన ఓయూ జేఏసీ అధ్యక్షులు డాక్టర్ ఎల్చాల దత్తాత్రేయ, హైకోర్టు న్యాయవాది బూర రమేష్‌ను మంగళవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఘనంగా సన్మానించారు.



ఆవో భాయ్.. ఖావో హలీం

రంజాన్ మాసం రేపటి నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో లాలాపేటలోని అంబేడ్కర్ విగ్రహం సెంటర్ వద్ద జాహంగీర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాబుఖాన్ చికెన్ హలీం సెంటర్‌ను మంగళవారం డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారావు హలీం భట్టిపై కూర్చుని కొందరికి హలీం అందించారు. -లాలాపేట



సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379